Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి సెల్ : 9440815774

ప్రచురణ : తిరుపతి | సంపుటి : 02 | సంచిక :104 | అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణంరాజు | మంగళవారం 14 ఏప్రిల్ 2026.. | పేజీలు : 4 | వెల : 2

## కొత్తగా మరో 62 అన్న క్యాంటీన్లు



- రాష్ట్రంలో 269కి పెరగనున్న క్యాంటీన్ల సంఖ్య
- 5న ధరణికోటలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించనున్న సీఎం

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

కార్మికులు, కూలీలు, గ్రామీణులు వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు వచ్చే ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదన్న సంకల్పంతో 207 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసిన ప్రజా ప్రభుత్వం... తాజాగా మరికొన్ని అన్న క్యాంటీన్లు అందుబాటు లోకి తీసుకొస్తోంది. రూ.5లకే - మిగతా3లో



### పార్లమెంటు కొత్త చరిత్ర లిఖించడానికి చేరువలో ఉంది

- నారీ శక్తి వందన్ సమ్మేళన్‌లో ప్రధాని కీలక వ్యాఖ్యలు
- మహిళా రిజర్వేషన్ బిల్లు 21వ శతాబ్దపు పెద్ద నిర్ణయం
- 2029లోగా అమలు చేయాలని లక్ష్యం
- అన్ని పార్టీల సహకారం అవసరమని మోదీ పిలుపు

## ప్రజల భద్రత, పర్యావరణంపై జాగ్రత్తల విషయంలో

# రాజీ పడొద్దు



- కేంద్ర ప్రతినిధి బృందంతో సీఎం భేటీ
- కేంద్ర ప్రతిపాదిత డీ-రెగ్యులేషన్ ఫేజ్-2 విధానాలపై సమీక్ష
- పరిశ్రమల ఏర్పాటులో వేగం అనుమతుల్లో సులభతరంపై చర్చ
- ఫైర్ సేఫ్టీ, పర్యావరణం, విద్యుత్, పర్యాటకం, విద్య, ఆరోగ్య రంగాల్లో అనుమతుల సరళీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలి
- విద్యుత్ కనెక్షన్లను త్వరగా అందించాలి
- ఎంఎస్ఎంఈ రంగంలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలి

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

పరిశ్రమలు ఏర్పాటులో జాప్యం జరగ్గకుండా ఇప్పటికే అమలు చేస్తున్న విధానాలను మరింత సరళతరం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాల తొలగింపునకు అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకురావాలని దిశానిర్దేశం చేశారు. పారిశ్రామిక ప్రగతికి మే నాటికి డి-రెగ్యులేషన్ ఫేజ్-2 అమలు చేయాలని స్పష్టంచేశారు. ప్రస్తుతం 800కు పైగా ఉన్న నిబంధనలను 100లోపు తీసుకురావాలన్నారు. అనుమతులకు లైసెన్సులను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కేంద్రం అమలు చేస్తున్న డి-రెగ్యులేషన్ ఫేజ్-2 కార్యక్రమంపై చర్చించేందుకు స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం సీఎంతో సమావేశమయ్యారు. సీఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. పరిశ్రమల ఏర్పాటులో వేగం - మిగతా3లో

## మహిళా రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదు

- రాజకీయ లబ్ది కోసమే మోదీ సర్కార్ అలా చేస్తోంది
- పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో కీలక బిల్లులను సభ ముందుకు తీసుకురానున్న కేంద్రం
- మహిళా రిజర్వేషన్ చట్టానికి తాము వ్యతిరేకం కాదన్న ఖర్గే
- నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదన అత్యంత ప్రమాదకరమైనదిగా అభివర్ణించిన సోనియా గాంధీ



## ఐదుకోట్ల ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం

# అమరావతి



- 'అమరావతి'కి అండగా నిలిచారు..
- ఏపీ రాజధాని చట్టబద్ధతకు ఆమోద ముద్ర వేశారు
- ఐదుకోట్ల ఆంధ్రుల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నాం
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి నారా లోకేష్
- అమరావతి చిరస్థాయిగా గుర్తుండిపోతుందన్న రాష్ట్రపతి

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఢిల్లీ**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్ట బద్ధత కల్పిస్తూ పార్లమెంటు చేసిన చట్టానికి ఆమోద ముద్ర వేసినందుకు విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కృతజ్ఞతలు తెలియజేశారు. మా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్-మా రాజధాని అమరావతి అని ఆంధ్రజాతి సగర్వంగా తల ఎత్తి చాటేలా చారిత్రక అమరావతి రాజధాని చట్టంపై సంతకం చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి మంత్రి నారా లోకేష్, ఎన్డీఏ ఎంపీలు రాష్ట్రపతి భవన్‌లో సోమవారం కలిసి ధన్యవాదాలు తెలిపారు. విభజనతో కోలుకోని విధంగా ఆంధ్రప్రదేశ్ నష్టపోయిందని, రాజధాని లేని రాష్ట్రంగా తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని గుర్తించి.. ఐదుకోట్ల ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా అమరావతిని రాజధానిగా నిర్ణయిస్తూ చట్టం చేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముగారికి ఆంధ్రజాతి - మిగతా3లో



## అమరావతిలో మరో కీలక ఘట్టం

- రేపు క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్స్ ప్రారంభం
- రేపు కీలక ఘట్టానికి వేదిక కానున్న రాష్ట్రం
- రెండు వేర్వేరు క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్స్‌ను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- మేధా టవర్స్‌తో పాటు ఎస్ఆర్ఎం యూనివర్సిటీ క్యాంపస్‌లో ఏర్పాటు




## కాల్పుల విరమణ వేళ హర్మూజ్ దాటిన తొలి భారతీయ నౌక

- రేపటికల్లా ఎల్‌పీజీతో భారత్‌కు 'జగ్ విక్రమ్'
- 24 మంది సిబ్బందితో కూడిన జగ్ విక్రమ్ నౌక ఏప్రిల్ 11నే హర్మూజ్ జలసంధిని దాటిందని వెల్లడి
- ప్రస్తుతానికి గల్ఫ్‌లో 15 భారత నౌకలు
- వాటిని వీలైనంత త్వరగా హర్మూజ్ దాటిస్తాం: కేంద్రం

## పోలింగ్ కేంద్రాల్లో బయోమెట్రిక్స్ అమలుపై పిల్

- కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు
- దొంగఓట్లు అరికట్టేందుకు బయోమెట్రిక్స్ నమోదు చేయాలని సుప్రీంకోర్టులో పిల్
- ఎన్నికల నిర్వహణపై కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు





## విజయ్ చాలా పెద్ద స్టార్ ప్రజలకు సేవ చేయడం గొప్ప విషయం

- జనసేనాని విత్ జెన్‌జీ కార్యక్రమంలో విజయ్‌పై పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు
- రాజకీయాల్లో రాణించడానికి విజయ్‌కు సలహా ఇస్తారా అని ప్రశ్న



## మహిళా సీఎంగా అలాంటి సలహా ఇచ్చినందుకు సిగ్గుపడాలి

- మమతపై అమిత్ షా ఫైర్
- రాత్రి 7 తర్వాత ఇళ్ల బయటకు రావద్దన్నారు
- మహిళా సీఎంగా మహిళలకు ఇచ్చిన సలహాకు మమత సిగ్గుపడాలి
- బీజేపీ వస్తే, యువతులు అర్ధరాత్రి స్కూటర్‌పై తిరగొచ్చు
- బెంగాల్ ఎన్నికల ర్యాలీల్లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

## కెజీబీవీ పాఠశాలలో "మీ భద్రత మా బాధ్యత"




**శాంతిపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 13:**
కుప్పంనియోజకవర్గం శాంతిపురం మండలం కడపల్లి కెజీబీవీ పాఠశాలలో విద్యార్థుల భద్రతపై అవగాహన కల్పించే ఉద్దేశంతో "మీ భద్రత మా బాధ్యత" కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా పోలీసు అధికారి తుషార్ డూడి ఆదేశాల మేరకు, కుప్పం డీఎస్పీ పార్థసారథి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కుప్పం గ్రామీణ సర్కిల్ ఇన్స్పెక్టర్ మల్లేష్ యాదవ్, ఉప ఇన్స్పెక్టర్ నరేష్ మరియు రాళ్లబూదుగూరు పోలీసు సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మహిళలు, బాలల భద్రత, సైబర్ నేరాలు, ధైర్యస్పర్శ, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, ఆన్లైన్ మోసాలు, పోక్సో చట్టం, మంచి స్పర్శ--చెడు స్పర్శ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే ఇతర భద్రతా సూచనలను కూడా వివరించి విద్యార్థుల్లో జాగ్రత్తలు పెంపొందించే దిశగా సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శక్తి బృందాలు, మహిళా పోలీసులు, జిల్లా మహిళా ప్రత్యేక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్‌లో ఆకస్మిక తనిఖీ

### ప్రయాణికుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి .. ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 13**
కుప్పం ఆర్టీసీ బస్టాండ్‌లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి ప్రయాణికుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉపాధ్యక్షుడు పి.ఎస్. మునిరత్నం, జిల్లా ప్రజా రవాణా అధికారి. బస్టాండ్ పరిసరాల పరిశుభ్రత, ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, టికెట్ విధానం, బస్సుల సమయపాలన వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. బస్టాండ్‌లోని దుకాణాలు, మరుగుదొడ్ల పరిస్థితిని కూడా పరిశీలించి లోపాలను గుర్తించారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. బస్సుల్లో ప్రయాణిస్తున్న వారితో పాటు పాఠశాల విద్యార్థులతో కూడా ముచ్చటించి అభిప్రాయాలను స్వీకరించారు. కుప్పంలో సుమారు 75 కోట్ల వ్యయంతో కొత్త ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయని తెలిపారు. ఆధునిక సౌకర్యాలతో కూడిన బస్టాండ్ నిర్మాణం ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. అదనంగా కొత్త బస్సులను ప్రవేశపెట్టి రవాణా సౌకర్యాలను విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో విద్యుత్ ఆధారిత బస్సులు, శీతలీకరణ సౌకర్యాలతో కూడిన బస్సులను కొనుగోలు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. రవాణా సేవలను మరింత బలోపేతం చేసి గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు మెరుగైన సదుపాయాలు కల్పించడం లక్ష్యమని పేర్కొన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రయాణికుల కోసం తాగునీటి సదుపాయాలు, చల్లని నీటి ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. రాష్ట్రంలో రవాణా రంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు.

## సింగిల్ వినియోగ ప్లాస్టిక్‌పై నిషేధం

### నియమాలు ఉల్లంఘిస్తే జరిమానాలు.. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రావు

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 13:**



కుప్పం పట్టణంలో పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఒక్కసారి వినియోగించే ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం అమల్లో ఉందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ప్లాస్టిక్ వలన నేల, నీరు, జంతువులకు హాని కలగడంతో పాటు ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. 125 మైక్రాన్ లలోపు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్లేట్లు, స్ట్రాలు వంటి వస్తువులను వినియోగించరాదని స్పష్టం చేశారు. వీటి స్థానంలో జ్యూట్ సంచులు, గుడ్డ సంచులు, కాగితం సంచులు లేదా బయోడిగ్రేడబుల్ ప్లాస్టిక్ వినియోగించాలని ప్రజలకు సూచించారు. పట్టణంలోని చిన్న వ్యాపారులు ఈ నియమాలను కచ్చితంగా పాటించాలని, ఉల్లంఘనలపై జరిమానాలు విధించబడతాయని హెచ్చరించారు. బయోడిగ్రేడబుల్ ప్లాస్టిక్ సంచులు పట్టణంలోని ప్యాలెస్ రోడ్డులో ఉన్న మున్సిపల్ షాప్ సముదాయంలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోవడంలో ప్రజల సహకారం అవస రమని మున్సిపల్ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## జనాభా లెక్కల సేకరణ 16 నుంచి ప్రారంభం

### ప్రజల సహకారం కోరుతూ మున్సిపాలిటీ విజ్ఞప్తి

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 13:**



భారత జనాభా లెక్కల సేకరణలో భాగంగా 2026 సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత ప్రక్రియ ఈ నెల 16 నుంచి ప్రారంభం కానుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రావు తెలిపారు. ఈ దశలో ఇళ్ల వివరాలు, ఇతర వసతులకు సంబంధించిన సమాచారం సేకరించబడనుంది. ఇందుకు సంబంధించి నియమిత సిబ్బందికి అవసరమైన వివరాలు అందజేసి ప్రజలు సహకరించాలని కోరారు. జనాభా లెక్కల సేకరణ సక్రమంగా పూర్తయ్యేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈసారి ప్రజలకు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే అవకాశం కూడా కల్పించబడిందని తెలిపారు. అధికారిక పోర్టల్ ద్వారా స్వీయ నమోదు చేసుకునే సదుపాయం అందుబాటులో ఉందని, ఈ అవకా శాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అదనపు వివరాల కోసం మున్సిపల్ కార్యాల యాన్ని సంప్రదించాలని సూచించారు

# పోషణ పక్వాడా కార్యక్రమం

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్13:**
శ్రీకాళహస్తి ఐసిడిఎస్ శ్రీకాళహస్తి సిడిపిఓ బి.శాంతిదుర్గ ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు అంగన్వాడి కేంద్రం నందు పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని అంగన్వాడి గ్రేడ్ వన్ సూపర్వైజర్లు భాగ్యలక్ష్మి హరిత, అత్యంత వేడుకగా నిర్వహించారు. గర్భిణీలకు బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. కుటుంబ బాధ్యతలపై జీరో నుంచి చిన్నారులకు మెదడు వికాసంపై మరిన్ని అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేట్ వన్ సూపర్వైజర్లు భాగ్యలక్ష్మి, హరిత,మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వేసవిలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య భాగ్యం కల్పించేందుకు పోషణ పక్వాడా పక్షోత్స వాలనునిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 9న ప్రారంభమైన ఈ కార్యక్రమాలు 23 వరకు కొనసాగుతాయి. చిన్నారుల పౌష్టి కాహారంపై ప్రత్యేక శ్రద్ధను వహిస్తూ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఇంటింటికీ వివరించనున్నామని. ప్రభుత్వం స్త్రీ,శిశు సంక్షేమశాఖ ద్వారా అంగన్‌వాడీకేంద్రా ల్లో ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాల కు శ్రీకారంచుట్టింది. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు పలు సూచనలు అంగన్ వాడీ కేంద్రంగా అందిస్తున్నామని. గర్భిణి అని తెలిసిన తర్వాత మహిళలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం,విశ్రాంతి నియమాలు,ఇతర అంశాలను విశదీకరించనన్నమని. బాలింతలకు ఆరోగ్య జాగ్రత్తలను వివరి స్తూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పదార్థాలు,వివిధ ఆట




వస్తువులతో పిల్ల లకు అవగాహన కల్పిస్తామని. చిన్నారు లు శారీరక, మానసిక ఇబ్బందులు లేకుండా ఎదిగేందుకు వారికి అవసరమైన పౌష్టికాహారం అందించాలని సూచిస్తున్నారు. ఏడాది వయస్సు దాటిన నుంచి చిన్నారులకు ఎటువంటి పౌష్టికాహారం అందించాలి, టీకాలు, ఇతర ఆరోగ్య సంరక్షణ చర్యలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తారు. ప్యాకె ట్లలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు ఎట్టి పరిస్థితుల్లో వాడరాదని అవగాహన కల్పిస్తారు. తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు వంటివి ఎక్కువగా తీసుకోవాలని, జంక్ ఫుడ్‌తో అధిక బరువు, మధుమేహ, రక్తపోటు, మూత్రపిండాల సమస్యలు వచ్చే అవకాశంపైన వివరిస్తారు. ప్రధానంగా జంక్‌ఫుడ్‌గా బదులుగా మిల్లెట్ తృణధాన్యాలుతో పలు లడ్డూల తయారీని నేర్పుతారు. పిల్లలకు వ్యాయామం ఉండేలా ఆటలను ప్రోత్సహించేలా చర్యలు చేపడతారు. పిల్లల ఆరోగ్యంలో పురుషుల పాత్ర పై వివరిస్తామని. పిల్లలు కలిసి ఇంట్లో వాడే పదార్థాలతో బొమ్మలు తయారు చేసేలా అవగాహన కల్పిస్తారు. చిన్నారులతో కలిసి తల్లిదండ్రు ల్లో అక్షరాస్యత పెంచేలా కమ్యూనిటీ రీడింగ్ సర్కిల్‌ను విస్తరించనున్నారు. ప్రధానంగా తల్లి లేదా తండ్రి ఎవరో ఒకరు కనీసం అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఈ వారోత్సవాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటారు. వయోజన విద్యాకేంద్రంలో చదువురాని వారిని చేర్పించి అక్షరాస్యులుగా చేయడానికి ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఉపాధ్యాయులు దిల్షాద్, శాంతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

### శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని కుటుంబ సమేతంగా

## దర్శించుకున్న కావలి ఎమ్మెల్సీ గ్రీష్మ



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 13:**
శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానమునకు కుటుంబ సమేతంగా దర్శించుకున్న కావలి ఎమ్మెల్సీ గ్రీష్మ సోమవారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి శ్రీకాళహస్తి దేవస్థానం ఆలయ అధికారులు దక్షిణగోపురంవద్ద స్వాగతం పలికారు. అనంతరం స్వామి అమ్మవార్ల ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేసి దక్షిణామూర్తి సన్నిధి వద్ద వారికి వేదపండితులచే ఆశీర్వదించి శేష వస్త్రాలతో సత్కరించి స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏ.పీ.ఆర్.ఓ.రవి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కుప్పంలో భారీగా రేషన్ బియ్యం స్వాధీనం

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 13:**



కుప్పం నియోజకవర్గం గుడిపల్లిలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు భారీగా స్వాధీనం చేసుకున్నారు. గుడిపల్లి మండలంలోని గుత్తార్లపల్లి సమీపంలోని ఓ ఇంటిపై సమాచారం మేరకు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు నాలుగు టన్నుల రేషన్ బియ్యంతో పాటు ఒక టెంపోను స్వాధీనం చేసుకున్నారు. కుప్పం నుండి కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. అదేవిధంగా తమిళనాడు, ఆంధ్ర ప్రాంతాలకు చెందిన రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా కుప్పం డీఎస్పీ పార్థసారథి, మాట్లాడుతూ, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎస్పీ, రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ నేతృత్వంలో ఈ దాడులు చేపట్టినట్లు తెలిపారు. అలాగే ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఎక్కడైనా అక్రమ కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని సూచించారు.

### శ్రీకాళహస్తి నూతన ఎమ్మార్వోగా

## బాధ్యతలు చేపట్టిన టీవీ సుబ్రహ్మణ్యం




**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 13:**
శ్రీకాళహస్తి ఎమ్మార్వో కార్యాలయానికి నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన టీవీ సుబ్రహ్మణ్యం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రజలకు ఎటువంటి సమస్యలు వచ్చిన ఎమ్మార్వో కార్యాలయంలో తనను సంప్రదిస్తే సమస్యలు పరిష్కరించే దిశగా కార్యాచరణ చేపడతానన్నారు, గ్రీవెన్స్ డే కార్యక్రమానికి ఎక్కువ ప్రాముఖ్యతను ఇచ్చి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్‌ను విజయవంతంగా కొనసాగించేందుకు తనవంతు కృషి చేస్తానని సందర్భంగా తెలియజేశారు.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణకు విరాళం ఏర్పాట్లు ముమ్మరం

**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 13**
వెదురుకుప్పంమండలం మారేపల్లి గ్రామంలో ఏప్రిల్ 14న నిర్వహించనున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావలసిందిగా గ్రామ పెద్దలు, యువకులు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మోహన్ మురళిని ఆహ్వానించారు. ఆహ్వానాన్ని స్వీకరించిన మోహన్ మురళి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తన వంతు సహకారంగా పదివేల రూపాయ ల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్థులు ఏర్పాట్లు కొనసాగిస్తున్నారు.

## జాబ్ మేళా గోడ పత్రిక ఆవిష్కరణ



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 13:**
శ్రీకాళహస్తి శ్రీకాళహస్తిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం శ్రీకాళహస్తి స్థానిక శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఏప్రిల్ 15వ తేదీ నిర్వహించనున్న జాబ్ మేళా గోడ పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి కూటమి నాయకులు ఘన నివాళులు అర్పించనున్నమని తెలియజేశారు. శ్రీకాళహస్తిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పురపాలక సంఘం నిధులతో మరింత హంగులతో నూతనంగా నిర్మింపచేసామని తెలియజేశారు. దేశమంతటా ఆ మహానుభావునికి జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్నామని ప్రతి ఒక్కరు ఆయనకు నివాళులర్పించి ఆయన అడుగుజాడల్లో నడవవలసిందిగా ఈ సందర్భంగా ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.తన తండ్రి మాజీ మంత్రివర్యులు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతిని పురస్కరించుకొని ఈనెల 15వ తేదీన అనేక సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు. తెల్లవారుజామున శ్రీకాళహస్తిని ప్రభుత్వ ఆసుపత్రి నందు అపోలో ఆస్పత్రికి చెందిన డాక్టర్లచే మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నామని దీనిని ప్రజల సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఉదయంతొమ్మిది గంటల శ్రీకాళహస్తిలోని స్కిట్ కళాశాల నందు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని నిరుద్యోగ యువతీ,యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగాలు పొందవలసిందిగా ఆయన నిరుద్యోగ యువతీ యువకులకు విజ్ఞప్తి చేశారు. రేణిగుంట నందు మెగా ఐ, క్యాంపు నిర్వహిస్తున్నామని ఈ మెగా ఐ క్యాంపును కూడా ప్రజల సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.అన్నదానాలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మాజీ మంత్రివర్యులు దివంగతనేత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి తమ వద్ద భౌతికంగా లేకపోయినా ఆయన చేసిన సేవా కార్యక్రమాలు, ఆయన చేసిన నియోజకవర్గ అభివృద్ధి ఇంకా తమ కళ్ళకు కట్టినట్లుగా కనిపిస్తుందని ఆయన అడుగుజాడల్లోనే నడుస్తూ తాను శ్రీకాళహస్తి నియోజక వర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నానని సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్, తొట్టంబేడు మండలం అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజు నాయుడు, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుడు గోపీనాథ్, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మునిసిపల్ కమిషనర్ ఆదేశం



**సూళ్లూరుపేట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 13:**
రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని సూళ్లూరుపేట తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తిరుపతిజిల్లా సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ కే .చిన్నయ్య ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. మున్సిపల్ ఆఫీసులో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ పైప్ లైన్ల లీకేజీలను అరికట్టాలని, ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతినెల శుభ్రం చేయాలని సూచించారు. అనధికారిక కులాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించాలని వార్డుల్లో క్లోరినేషన్ పరీక్షలు నిర్వహించి ఆ వివరాలను ఏపీ సీఎం ఎస్ యాప్‌లో అప్లోడ్ చేయాలని స్పష్టం చేశారు. తాగునీటితోపాటు వీధి దీపాల విషయంలో కూడా ప్రజల నుండి ఫిర్యాదులు రాకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ శ్రీనివాస రావు ఏఈ మనోజ్ కుమార్ సచివాలయ అమ్యూనిటీస్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మా ప్రతి అక్షరం - ప్రజల కోసం
చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



# ప్రజల భద్రత, పర్యావరణంపై జాగ్రత్తల విషయంలో రాజీ పడొద్దు

-మొదటిపేజీ తరువాయి

పెంచడం అనుమతుల సులభతరం చేయడం అనవసరపు నిబంధనల సడలింపుపై చర్చించారు. కేంద్ర ప్రతిపాదనలను సీఎంకు స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ వివరించారు. రాష్ట్ర విధానాలను, ప్రణాళికలపై ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

డి-రెగ్యులేషన్ ఫేజ్-1లో మొత్తం 7 శాఖల్లో 23 ప్రాధాన్యత అంశాలను పూర్తి చేశామన్నారు. ఇక ఫేజ్-2లో 28 ప్రాధాన్య అంశాలు నిర్దేశించుకున్నట్టు చెప్పారు. మొత్తం 47 సిఫార్సుల్లో ఇప్పటివరకు 18 అమలు కాగా, మే 31 నాటికి పూర్తి లక్ష్యం చేరుకుంటామన్నారు. పరిశ్రమలకు అనుమతుల ప్రక్రియలో ఉన్న క్లిష్టతను తగ్గించి, వేగం పెంచాల్సిన అవసరం ఉందని సీఎం సూచించారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాలు తొలగింపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక అంశాల్లో రాజీ పడొద్దని స్పష్టం చేశారు.



### వివరాలన్నీ ఆన్‌లైన్ చేయాలి

అనవసర వేధింపులు లేకుండా థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యం ఇవ్వాలని, డబుల్ లైసెన్సింగ్ వంటి వాటిని పూర్తిగా తొలగించాలని సీఎం సూచించారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యాపారాలకు జీవితకాల చెల్లుబాటు ఉండేలా వ్యవస్థను తీర్చిదిద్దాలన్నారు. ఫైర్ సేఫ్టీ అంశంలో నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్రానికి అనుకూలమైన, సరళమైన నిబంధనలు అమలు చేయాలని ఆదేశించారు. దరఖాస్తు నుంచి అనుమతి వరకూ మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్ చేయాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సమయం కనీసం 40 శాతం వరకు తగ్గేలా కార్యాచరణను రూపొందించాలని దిశానిర్దేశం చేశారు.

పరిశ్రమలు, వ్యాపారాల కోసం ప్రస్తుతం 82 రకాల అనుమతులు తీసుకోవాల్సి ఉందని ఆ సంఖ్యను 57కు తగ్గించాలని సూచించారు. బిల్డింగ్ ప్లాన్ ఆమోదాలు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు వంటి కీలక అనుమతులు 30 వరకు ఉన్న ప్రక్రియలను 18కు తగ్గించేలా చూడాలన్నారు. పారిశ్రామిక పార్కులు, క్లస్టర్లలో భూమి వినియోగాన్ని మరింత సులభతరం చేసి, పెట్టుబడిదారులకు వేగంగా భూమి కేటాయించే విధానాన్ని బలోపేతం చేయాలని ఆదేశించారు. ఒకే నోడల్ ఏజెన్సీ ద్వారా అన్ని అనుమతులను ఇవ్వాలనే దిశగా ఆలోచన చేయాలని సీఎం సూచించారు.

ఫైర్ సేఫ్టీ, పర్యావరణం, విద్యుత్, పర్యాటకం, విద్య, ఆరోగ్య రంగాల్లో అనుమతుల సరళీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విద్యుత్ కనెక్షన్లను త్వరగా అందించాలని చెప్పారు. ఎంఎస్‌ఎంఈ రంగంలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని ఆదేశించారు. నిర్దిష్ట కాలానికి తనిఖీలు తగ్గించడం వంటి సంస్కరణలతో పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణాన్ని సృష్టించే దిశగా పని చేయాలని సూచించారు. దరఖాస్తు నుంచి అనుమతి వరకూ అన్ని సేవలను ఆన్‌లైన్‌లోకి తీసుకువస్తే దరఖాస్తుదారులకు చాలా వరకు పని భారం తగ్గుతుందన్నారు.

### డి-రెగ్యులేషన్ ఫేజ్-3ను అమలు చేస్తున్నారా

డి-రెగ్యులేషన్ విషయంలో కేంద్రం ప్రతిపాదించిన అంశాల కన్నా మెరుగ్గా ఏపీ పని చేస్తోందని స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ సీఎం చంద్రబాబుతో అన్నారు. నిర్దిష్ట గడువులోగా ఏపీ ఫేజ్-2ను అమలు చేస్తుందన్న నమ్మకం తమకు ఉందని చెప్పారు. పారిశ్రామిక రంగంలో అభివృద్ధి సాధించేందుకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి మారామని సీఎం వెల్లడించారు. అటవీ చట్టాలను వీలైనంత సరళీకరించాలంటూ కేంద్ర బృందానికి సూచించారు. డి-రెగ్యులేషన్ ఫేజ్-3ను అమలు చేస్తున్నారా అని ముఖ్యమంత్రి స్టీల్ సెక్రటరీని అడిగారు. జూన్ నెల నుంచి ఆ పని మీద ఉంటామని పౌండ్రిక్ తెలిపారు. ఫేజ్-3లో టెక్నాలజీ, ఏఐ ఇంటెలిజెన్స్ టూల్స్ వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. డేటా లేక్, రియల్ టైం డేటా, సీఎఫ్ఎంఎస్, అవేర్-2.0, వాట్సాప్ గవర్నెన్స్ వంటి వ్యవస్థలను ఇప్పటికే తాము వినియోగిస్తున్నామని పౌండ్రిక్‌కు సీఎం వివరించారు.

# అమరావతిలో మరో కీలక ఘట్టం

ప్రపంచ క్వాంటం డే పురస్కరించుకుని దేశ చరిత్రలో ఓ కీలక ఘట్టానికి ఆంధ్రప్రదేశ్ వేదిక కానుంది. అమరావతి క్వాంటం వ్యాలీలో భాగంగా రేపు(ఏప్రిల్ 14)వ తేదీన ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, మేధా టవర్స్?లో రెండు వేర్వేరు క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్స్?ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. అమరావతి కేంద్రంగా ఆవిష్కృతం అవుతున్న క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీతో టెక్ శకంలో నూతన అధ్యాయానికి నాంది పడనుంది. విజన్ నుంచి క్యూబిట్స్ వరకు ఆంధ్రప్రదేశ్ భారత్ క్వాంటమ్ భవిష్యత్తును నిర్మిస్తోందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ క్వాంటమ్ దినోత్సవం సందర్భంగా రేపు (ఏప్రిల్ 14)న ముఖ్యమంత్రి చంద్రబాబు ా=వీ యూనివర్సిటీలో దేశంలోనే తొలి స్వదేశీ, ఓపెన్ యాక్సెస్ క్వాంటమ్ కంప్యూటర్లు -- చాూఖెతీఋజ్ఞఅ 1ా డ 1ు --ను ప్రారంభించనున్నారని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. దీంతో అమరావతి క్వాంటమ్ వ్యాలీ ప్రపంచ స్థాయి కేంద్రంగా అవతరించబోతోందని తెలిపారు. భవిష్యత్తు ఇక్కడే ఉందన్నారు. అమరావతిలో భారత్‌లో నిర్మితమై, భారతదేశానికి అందుబాటులో, ప్రపంచానికి సేవ చేసేందుకు సిద్ధంగా ఉందని ప్రకటించారు. క్వాంటమ్ ప్రారంభోత్సవానికి సంబంధించిన వీడియోను లోకేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.




క్వాంటం హార్డ్ వేర్ తయారీలో కీలకం

మంగళవారం గన్నవరంలోని మేధా టవర్స్?తో పాటు రాజధానిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ క్యాంపస్‌లో ఏర్పాటు అవుతున్న 1ఎస్, 1 క్యూ పేరిట రెండు వేర్వేరు క్వాంటం టెస్టింగ్ రిఫరెన్సు ఫెసిలిటీలను ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. దీంతో దేశంలోనే క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రంగా ఏపీ అవతరించనుంది. దేశీయంగా తయారైన ఈ క్వాంటం రిఫరెన్స్ టెస్ట్ ఫెసిలిటీతో క్వాంటం కంప్యూటర్ హార్డ్ వేర్?ను పరీక్షించి సర్టిఫై చేసే సామర్థ్యం అమరావతి క్వాంటం వ్యాలీకి రానుంది.

మేధాటవర్స్‌లో క్యూబిటెక్ సంస్థ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తున్న ఈ క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీ టెస్ట్ బెడ్‌లు క్వాంటం హార్డ్ వేర్ తయారీలో కీలకం కానున్నాయి. ఈ రెండు చోట్లా మైనస్ 273 సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలో పనిచేసే ఈ మినీ క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్?లు క్వాంటం ఉపకరణాలను పరీక్షించేలా తోడ్పాటు అందించనున్నాయి. క్వాంటం కంప్యూటర్ ఉపకరణాలు తయారు చేసే కంపెనీలతో పాటు పరిశోధకులు, విద్యార్థులు, నిపుణులకు ఉపయోగపడేలా ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఓపెన్ యాక్సెస్ రిఫరెన్సు ఫెసిలిటీని ఏర్పాటు చేశారు.

దేశంలోనే తొలిసారిగా

అమరావతిలో ఏర్పాటు చేస్తున్న ఈ రెండు క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీల్లోనూ పూర్తిగా స్వదేశంలో తయారైన ఉపకరణాలనే ఉపయోగించారు. మేధాటవర్స్?లో క్యూబిటెక్ సంస్థ 1 క్యూ పేరిట క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్?ను ఏర్పాటు చేసింది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 1 ఎస్ పేరిట సూపర్ కండక్టింగ్ టెక్నాలజీతో క్వాంటం టెస్ట్ బెడ్ ను నిర్మించారు. ఈ క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీల ఏర్పాటులో టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సహా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, డీఆర్డీఓ లాంటి సంస్థలు సహకారం అందించాయి. దేశంలోనే తొలిసారిగా ఏర్పాటైన ఈ టెస్ట్ బెడ్?ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి నేషనల్ క్వాంటం మిషన్ సహా, ఐఐటీ ప్రొఫెసర్లు, క్వాంటం రంగంలోని పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలు, క్వాంటం ఇన్నోవేషన్ స్టార్టప్ ల ప్రతినిధులు, రీసెర్చ్ స్కాలర్లు, నిపుణులు హాజరు కానున్నారు. ఏపీలోని వివిధ యూనివర్సిటీలు, కాలేజీల నుంచి వర్చువల్ గా దాదాపు 1.5 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

### తయారీ రంగంలో ముందడుగు

అమరావతిలో అత్యాధునిక క్వాంటమ్ కంప్యూటర్ల ఏర్పాటుతో పాటు, రాబోయే రోజుల్లో పూర్తిస్థాయి క్వాంటమ్ కంప్యూటర్లను, విడిభాగాల్ని అక్కడే తయారుచేసి ఎగుమతి చేయాలన్నది ప్రభుత్వ సంకల్పం. గత ఏడాది సెప్టెంబరు 9న హార్డ్‌వేర్ విడిభాగాల తయారీదారులతో ముఖ్యమంత్రి జరిపిన సమావేశంలో క్వాంటమ్ విడిభాగాల టెస్టింగ్, వ్యాలిడేషన్, బెంచ్‌మార్కింగ్, సర్టిఫికేషన్ కోసం రిఫరెన్స్ సదుపాయాలు కావాలని వారు కోరారు. అమరావతిలో రిఫరెన్స్ ఫెసిలిటీస్‌ను కల్పించాలన్న నిర్ణయం అప్పుడే జరిగింది. ఈ సదుపాయాలు రావడంతో అమరావతిలోనే క్వాంటమ్ పరికరాలు తయారుచేసేందుకు దేశంలోని పలు సంస్థలు ముందుకొచ్చే అవకాశం ఉంది. మన దేశంలో ప్రస్తుతం కొన్ని సంస్థలు క్వాంటమ్ విడిభాగాలు తయారుచేస్తున్నా, ప్రాసెసర్ల వంటివాటిని టెస్టింగ్ కోసం విదేశాలకు పంపాల్సి వస్తోంది. అమరావతి రిఫరెన్స్ ఫెసిలిటీస్‌తో క్వాంటమ్ హార్డ్‌వేర్ తయారీ రంగంలో భారత్ పెద్ద ముందడుగు వేయనుంది.

### క్వాంటమ్ కంప్యూటర్ల తయారీకే కాకుండా

అమరావతి క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీస్ కోసం తయారు చేసిన క్రయోజెనిక్స్, ప్రిసిషన్, ఎలక్ట్రానిక్స్ సిస్టమ్స్, క్వాంటమ్ గ్రేడ్ ఫ్యాబ్రికేషన్ పరికరాలు, సదుపాయాలు కేవలం క్వాంటమ్ కంప్యూటర్ల తయారీకే కాకుండా, రక్షణ, ఆరోగ్య, సెమీకండక్టర్ తయారీ వంటి రంగాలకూ ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు. క్రయోజెనిక్ సిస్టమ్స్‌ను ఎంఆర్ఐ మెషీన్లు, స్పేస్ అప్లికేషన్లలో వినియోగిస్తారు. ప్రెసిషన్ ఎలక్ట్రానిక్స్ డిఫెన్స్ సెన్సింగ్, రాడార్ సిస్టమ్స్, అడ్వాన్స్‌డ్ ఇన్‌స్ట్రుమెంటేషన్‌కు ఉపయోగపడుతుంది. క్వాంటమ్‌గ్రేడ్ ఫ్యాబ్రికేషన్ సదుపాయాలను సెమీకండక్టర్ల తయారీ, డీప్‌టెక్ ఇండస్ట్రియల్ అప్లికేషన్లలో వినియోగిస్తారు.

# కేబినెట్‌లో లీక్ వీరులు...

**కాకినాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇప్పుడు ఒకే ఒక అంశం హాట్ టాపిక్‌గా మారింది. అదే 'కేబినెట్ అజెండా లీక్'. ప్రభుత్వ నిర్ణయాలు అధికారికంగా వెలువడక ముందే బయటకు పొక్కడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఈ అంశంపై మంత్రులకు ఆయన క్లాస్ పీకడమే కాకుండా, సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. సాధారణంగా కేబినెట్ సమావేశం అంటే అత్యంత గోప్యంగా జరిగే ప్రక్రియ. అందులో చర్చించే అంశాలు, తీసుకోబోయే నిర్ణయాలు సమావేశం ముగిసిన తర్వాత మీడియాకు వెల్లడిస్తారు. కానీ, గత కొంతకాలంగా ఏపీలో కేబినెట్ భేటీ కంటే ముందే అజెండాలోని అంశాలు మీడియాలో హల్చల్ చేస్తున్నాయి. దీనిపై చంద్రబాబు గుర్రుగా ఉన్నారు.ప్రభుత్వంలోని అత్యున్నత నిర్ణాయక మండలి నిర్ణయాలు ఇలా వీధికెక్కడం ఏంటని సీఎం మంత్రులను సూటిగా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. కీలక సమాచారం బయటకు వెళ్లడం వల్ల ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతినడమే కాకుండా, కొన్ని నిర్ణయాల అమలులో ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు గత చరిత్రను గుర్తు చేస్తూ మంత్రులను హెచ్చరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎన్టీఆర్ తీసుకున్న సంచలన నిర్ణయాన్ని ఆయన ప్రస్తావించారు. గతంలో కేబినెట్ అజెండా లీక్ అయినప్పుడు, క్రమశిక్షణ విషయంలో రాజీ పడని ఎన్టీఆర్ ఏకంగా తన పూర్తి మంత్రిమండలిని రద్దు చేసిన విషయాన్ని చంద్రబాబు గుర్తు చేశారు. ఇకపై అజెండా లీక్ అయితే దానికి సంబంధిత శాఖా మంత్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని, బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని తేల్చి చెప్పారు.ప్రభుత్వ సమాచారం లీక్ అవ్వడం వెనుక రెండు ప్రధాన కోణాలు కనిపిస్తున్నాయి. తాము చేస్తున్న పనులు లేదా తీసుకోబోయే నిర్ణయాలను ముందే లీక్ చేయడం ద్వారా క్రెడిట్ కొట్టేయాలని కొందరు మంత్రులు లేదా వారి అనుచరులు ప్రయత్నిస్తున్నారా? అనే అనుమానం ఉంది. మంత్రుల కార్యాలయాల్లోని పీఎస్ లు లేదా ఇతర సిబ్బంది ద్వారా మీడియాకు సమాచారం చేరుతోందా? అనే కోణంలోనూ చర్చ జరుగుతోంది. భూముల కేటాయింపు లేదా కొత్త పథకాలకు సంబంధించిన నిర్ణయాలు ముందే లీక్ అయితే మార్కెట్ శక్తులు వాటిని ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. కేబినెట్ గోప్యతను కాపాడలేకపోతే ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న పట్టు సడలుతుందనే భావన ఏర్పడుతుంది.చంద్రబాబు కేవలం హెచ్చరికతోనే ఆగిపోకుండా, నిఘా పెంచాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. "గతంలో లీకులు జరిగాయి.. ఇకపై అవి పునరావృతం కాకూడదు" అని ఆయన స్పష్టం చేశారు. ఎన్టీఆర్ ఉదంతాన్ని గుర్తు చేయడం ద్వారా, తాను కూడా కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి వెనుకాడబోననే సంకేతాన్ని తన కేబినెట్ సహచరులకు పంపారు.

## ఐదుకోట్ల ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం అమరావతి

-మొదటిపేజీ తరువాయి

తరఫున ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా అమరావతి చరిత్ర--సంస్కతి--రాజధానిలో పూర్తయిన నిర్మాణాలు, రైతుల ఉద్యమం, మాస్టర్ ప్లాన్ ప్రకారం మొత్తం నిర్మాణాలు పూర్తయితే అమరావతి రాజధాని ఎలా ఉంటుందో సూచించే ఊహాచిత్రాలు, పర్యావరణహిత నిర్మాణ విశేషాలతో రూపొందించిన పుస్తకాన్ని ఎంపీలతో కలిసి లోకేష్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి అందజేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ అమరావతి కి శంకుస్థాపన చేసింది ప్రధాని నరేంద్ర మోదీ, 2024 లో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అమరావతి పనులు పునః ప్రారంభించింది ప్రధాని నరేంద్ర మోదీ అని రాష్ట్రపతికి వివరించారు. రాజధాని ఏర్పాటు కోసం చంద్రబాబు గారి పిలుపుతో 58 రోజుల్లోనే 34 వేల ఎకరాల భూములు రైతులు త్యాగం చేశారని, గత పాలనలో వారిపై దాడులు జరిగినా, అక్రమ కేసులు పెట్టినా, శాంతియుతంగా రాజధాని కోసం ఉద్యమించారని రాష్ట్రపతికి లోకేష్ వివరించారు. కోట్లాది ప్రజల కోరిక అయిన అమరావతి చట్టం తన హయాంలో రూపొందడం సంతోషంగా ఉందని, రైతులు రాష్ట్రంపై ప్రేమతో రాజధాని నిర్మాణం కోసం తమ భూమిని ఇచ్చారని రాష్ట్రపతి రైతుల త్యాగాలను కొనియాడారు. పోరాడి సాధించుకున్నది చిరస్థాయిగా గుర్తుండిపోతుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక విజనరీ లీడర్ అని ఆయన దూరదష్టితో రాష్ట్రాన్ని, రాజధాని అద్భుతంగా అభివద్ధి చేస్తారని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ అభివద్ధి పథంలో పయనించాలని, రాజధాని పనులు నిర్విఘ్నంగా కొనసాగాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు.

## కొత్తగా మరో 62 అన్న క్యాంటీన్లు

-మొదటిపేజీ తరువాయి

పేదలకు కడుపునిండా నాణ్యమైన భోజనాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ఈ సేవలను గ్రామీణ ప్రాంతాలకూ విస్తరిస్తామని చెప్పిన సర్కార్... ఆ హామీని ఆచరణలో పెడుతోంది. మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 204 అన్న క్యాంటీన్లను కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేయగా 3 క్యాంటీన్లు గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా 62 క్యాంటీన్లను గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. రెండవ విడత అన్నక్యాంటీన్లను ఈ నెల 15న ముఖ్యమంత్రి చంద్రబాబు పెదకూరపాడు నియోజకవర్గం, ధరణికోటలో ప్రారంభిస్తారు. ఈనెల 15వ తేదీన ప్రారంభించబోయే 62 క్యాంటీన్లతో ఈ సంఖ్య 269 కు పెరగనుంది. రుచి, శుచితో కూడిన ఆరోగ్యకరమైన ఆహారాన్ని పేదలకు ప్రభుత్వం అందిస్తోంది. క్యాంటీన్ల పున:ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ రాష్ట్రవ్యాప్తంగా పేదలు 8.80 కోట్ల భోజనాలు చేశారు. ఒక్కో అన్న క్యాంటీన్‌లో సగటున రోజుకు 1,013 మంది చేసే భోజనాలకు రూ.26,250 ఖర్చు అవుతోంది. 207 అన్న క్యాంటీన్ల ద్వారా రోజుకు 2.10 లక్షల మంది భోజనాలు చేస్తున్నారు. ఇందుకు రోజుకు రూ.54 లక్షలకు పైగా వ్యయం అవుతుండగా... సబ్సిడీ కోసం ప్రభుత్వం ఇప్పటి వరకూ రూ.243 కోట్లు వెచ్చింది. కొత్తగా ఏర్పాటు చేసే గ్రామీణ అన్న కాంటీన్ల సబ్సిడీకి ఏడాదికి రూ.58 కోట్లు వ్యయం అవ్వనుంది.

**ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన వివరాలు. .**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం పల్నాడు జిల్లా, పెదకూరపాడు నియోజకవర్గం, ధరణికోటలో పర్యటిస్తారు. మధ్యాహ్నం 12.40 గంటలకు ఉండవల్లి నుంచి బయలుదేరి ఒంటిగంటకు ధరణికోటకు చేరుకుంటారు. 01.30 గంటలకు అన్నాక్యాంటీన్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి భోజనం చేస్తారు. కార్యక్రమాన్ని ముగించుకుని 2.45 గంటలకు ఉండవల్లికి చేరుకుంటారు.

## రాజ్యసభ రేసు

## భారీగా పెరుగుతున్న ఆశావహులు

**విజయవాడ :** తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ సీట్ల కేటాయింపు అంశం ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. జూన్‌లో ఖాళీ అవుతున్న నాలుగు స్థానాలకు గాను, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎవరిని ఎంపిక చేస్తారనే దానిపై పార్టీ వర్గాల్లో తీవ్ర స్థాయిలో కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం వినిపిస్తున్న పేర్లలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మిగిలిన స్థానాలకు రకరకాల పేర్లు చర్చల్లోకి వస్తున్నాయి. టీడీపీ ఐటీ విభాగంలో చురుగ్గా ఉంటూ, గత ఎన్నికల్లో పార్టీ సోషల్ మీడియా వ్యూహకర్తగా పనిచేసిన చింతకాయల విజయ్ పేరు రేసులో ముందుండటానికి ప్రధాన కారణం యువతకు ప్రాధాన్యత ఇవ్వాలన్న అధిష్టానం ఆలోచనే. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి బలమైన బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో విజయ్ వైపు చంద్రబాబు మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో అనేక రాజకీయ సవాళ్లను ఎదుర్కొని పార్టీ కోసం నిలబడినందుకు ఆయనకు ఈ గుర్తింపు దక్కవచ్చని క్యాడర్ భావిస్తోంది.మరోవైపు, పార్టీలో అత్యంత సీనియర్ నేత అయిన యనమల రామకృష్ణుడు పేరు కూడా చర్చల్లో ఉంది. గత కొంతకాలంగా ఆయన రాజ్యసభకు వెళ్లాలని ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీకి ట్రబుల్ షూటర్‌గా, ఆర్థిక వ్యవహారాల్లో పట్టున్న నేతగా యనమల సేవలను ఢిల్లీ స్థాయిలో ఉపయోగించుకోవాలని అధిష్టానం భావిస్తే ఆయనకు అవకాశం దక్కవచ్చు. అయితే, సామాజిక సమీకరణాలు , కొత్త రక్తాన్ని ఎక్కించాలనే లోకేష్ వ్యూహం కారణంగా సీనియర్లకు ఏ మేరకు ప్రాధాన్యత ఉంటుందన్నది ఉత్కంఠగా మారింది. వ్యాపార కారణాలు, రాజకీయ ఒత్తిళ్ల వల్ల గత లోక్‌సభ ఎన్నికలకు దూరంగా ఉన్న గల్లా జయదేవ్ పేరు మళ్లీ తెరపైకి వచ్చింది. పార్లమెంటులో రాష్ట్ర సమస్యలపై గళం విప్పడంలో ఆయనకు ఉన్న అనుభవం, అంతర్జాతీయ స్థాయిలో ఆయనకున్న నెట్‌వర్క్ పార్టీకి అవసరమని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ఆయన రాజకీయాలకు బ్రేక్ ఇస్తున్నట్లు గతంలోనే ప్రకటించినందున, మళ్లీ రాజ్యసభ ద్వారా క్రియాశీలక రాజకీయాల్లోకి వస్తారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది. ఇక గత ఎన్నికల్లో చాన్స్ దొరకని దేవినేని ఉమ కూడా రేసులో ఉన్నారు. యువనేతలు వంగవీటి రాధాతో పాటు మహాసేన రాజేష్ వంటి వారు కూడా సామాజికవర్గ కోటాల్లో ప్రయత్నాలు చేస్తున్నారు. రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో చంద్రబాబు ప్రధానంగా మూడు సూత్రాలను పాటిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన వారికి ప్రాధాన్యత ఇస్తారు. బీసీ, ఎస్సీ , కాపు సామాజిక వర్గాలకు సమతుల్యత పాటించడం.. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర ప్రయోజనాల కోసం గట్టిగా మాట్లాడగలిగే వ్యక్తులను పంపే అంశాలను పరిశీలిస్తున్నారు. వీరితో పాటు పార్టీ కోసం పనిచేసిన మరికొందరు పారిశ్రామికవేత్తలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను కూడా టీడీపీ పరిశీలిస్తోంది. ఢిల్లీలో పార్టీ వాయిస్ బలంగా వినిపించే వారికే చంద్రబాబు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. మిత్రపక్షాలకూ సీట్లు కేటాయించాల్సి ఉంది. జాతీయ స్థాయి ప్రాధాన్యత దృష్ట్యా బీజేపీ ఓ సీటును కోరుకుంటుందని అంచనా వేస్తున్నారు. బీజేపీకి ఇస్తే జనసేన పార్టీకి చాన్స్ ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నారు. రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడైనా వచ్చే అవకాశం ఉన్నందున అభ్యర్థుల ఎంపికను చంద్రబాబు ఫైనల్ చేస్తున్నారు.

## 14 నుంచి 21 చిత్తూరు జిల్లాల్లో నియోజకవర్గాలు

**తిరుపతి :** ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు సొంత జిల్లా అయిన ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నియోజకవర్గాల పునర్విభజన అంశం ఇప్పుడు పెను సంచలనంగా మారింది. కేంద్రం నుంచి వస్తున్న సంకేతాలతో జిల్లా రాజకీయ స్వరూపమే మారిపోబోతోంది. ప్రస్తుతం ఉన్న 14 అసెంబ్లీ స్థానాల సంఖ్య ఏకంగా 21కి పెరిగే అవకాశం ఉండటంతో రాజకీయ పార్టీల్లోనూ, అభ్యర్థుల్లోనూ కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. 2004 వరకు ఉమ్మడి జిల్లాలో 15 నియోజకవర్గాలు ఉండేవి. 2009 పునర్విభజనలో వాయల్పాడు, పుత్తూరు, వేపంజేరి నియోజకవర్గాలు రద్దు కాగా.. కొత్తగా గంగాధర నెల్లూరు, పూతలపట్టు ఏర్పడ్డాయి. దీంతో సీట్ల సంఖ్య 14కి తగ్గింది. అయితే తాజా ప్రతిపాదనల ప్రకారం ఈ సంఖ్య 21కి చేరనుండటం విశేషం.రాష్ట్రంలోనే అతిపెద్ద జిల్లాగా ఆవిర్భవించిన తిరుపతిలో జనాభా ప్రాతిపదికన భారీ మార్పులు చోటుచేసుకోనున్నాయి. చంద్రగిరి నియోజకవర్గంలో భాగంగా ఉన్న తిరుపతి రూరల్ మండలాన్ని విడదీసి కొత్త నియోజకవర్గంగా మార్చే అవకాశం ఉంది. ఇందులో రామచంద్రపురం మండలాన్ని కూడా కలిపే అవకాశం ఉంది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య భారీగా ఉండటంతో రేణిగుంట కేంద్రంగా కొత్త సీటు ఏర్పాటుపై చర్చ జరుగుతోంది. గతంలో రద్దయిన పుత్తూరు నియోజకవర్గం మళ్ళీ తెరపైకి రానుంది.

## పి.ఆర్ జి.ఎస్ కార్యక్రమానికి కలెక్టర్, ఎమ్మెల్యేకు స్వాగతం



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 13:** చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు నియోజకవర్గం వెదురుకుప్పం మండల కేంద్రంలో నిర్వహించిన పి.ఆర్ జి.ఎస్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సుమీత్ కుమార్, ప్రభుత్వ విప్, గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ తెలుగు దేశం నాయకులు గురుసాల కిషన్ చంద్,వాణిజ్య విభాగ అధ్యక్షుడు బట్టే చాణిక్య ప్రతాప్, సీనియర్ నాయకులు బిమినేని మాధవ నాయుడు, తాతిరెడ్డి జై చంద్రారెడ్డి, కృష్ణా రెడ్డి కలిసి వారికి మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. కార్యక్రమం విజయ వంతంగా కొనసాగగా స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమంలో

## ప్రజాప్రతినిధులకు శాలువాతో సన్మానం



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 13:** గంగాధరనెల్లూరునియోజకవర్గం వెదురు కుప్పంమండల కేంద్రంలో నిర్వహించిన పి.జి. ఆర్.ఎస్ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్,గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్, జిల్లా కలెక్టర్ సుమీత్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు మోహన్ మురళి ఆధ్వర్యంలో వారికి శాలువాలతో సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో చవటగుంట పిఎసిఎస్ చైర్మన్ బోడి రెడ్డి సుధాకర్ రెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ బి.ఎం రవి, ఏఎంసీ డైరెక్టర్ వరప్రసాద్, బుచ్చిరెడ్డి కండిగా రిజర్వాయర్ చైర్మన్ కామసాని దామోదర్ రెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్ రెడ్డి,సీఈఓ రమేష్ రామకృష్ణారెడ్డి,దాము తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చలు నిర్వహించబడినట్లు తెలిసింది.

### అంబేద్కర్ జయంతి ముందురోజే విగ్రహానికి ఘనంగా

## పాలాభిషేకం నేడు ర్యాలీకి పిలుపు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 13:** కుప్పం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఒకరోజు ముందుగానే దళిత నాయకులు ఘనంగా అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకంతో పాటు పసుపు నీళ్లు, కుంకుమ నీళ్లతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రాజ్ కుమార్, వెంకటేష్, కన్నన్, యల్లప్ప తదితరులు పాల్గొని అంబేద్కర్ చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్థానికులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై అంబేద్కర్‌కు నివాళులు అర్పించారు. కార్యక్రమం భక్తి శ్రద్ధలతో కొనసాగింది. ఇదిలా ఉండగా నేడు సాయంత్రం నాలుగు గంటలకు కుప్పం తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్దకు చేరుకుని అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి ఐదు గంటలకు బస్టాండ్‌లోని అంబే ద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని నివాళులు అర్పించే కార్యక్రమాన్ని నిర్వహించను న్నట్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఎస్కే నభి, క్లస్టర్ ఇంచార్జ్ సోమశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇతర రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## గంగ జాతర మహోత్సవం పత్రిక పూజ

### నేడు మహా మంగళహారతి కార్యక్రమం



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 13:** కుప్పం పట్టణంలోని శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ దేవస్థానం వద్ద ఏప్రిల్ 14న సాయంత్రం 8 గంటలకు గంగ జాతర మహోత్సవం 2026 పత్రిక పూజాకార్యక్రమం, మహా మంగళహారతి నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశీస్సులతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షుడు పి.ఎస్ మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వానికి చెందిన భారతీయ జనతా పార్టీ, జనసేన, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ట్రస్ట్ బోర్డు చైర్మన్ బి.ఎం.కె రవిచంద్రబాబు, సభ్యులు విజ్ఞప్తి చేశారు.

## ఈశాన్య రాష్ట్రాల ఎంపీలతో కుప్పం ఇంజనీరింగ్ కళాశాల ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.సునీల్ రాజ్ భేటీ



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 13:** కుప్పం ఇంజనీరింగ్ కళాశాల ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.సునీల్ రాజ్ న్యూఢిల్లీలో ఈశాన్య రాష్ట్రాలకు చెందిన పార్లమెంట్ సభ్యులు సాలెంగ్ ఎ.సంగ్మా, సుపోంగ్మెరెన్ జమీర్‌లను వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులకు అందుబాటులో ఉన్న విద్యావకాశాలపై చర్చించారు. విద్యా రంగంలో 25 సంవత్సరాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న కుప్పం ఇంజనీరింగ్ కళాశాల సేవలను ఎంపీలు అభినందించారు. డాక్టర్ ఎన్.సునీల్ రాజ్ ఎంపీలను సత్కరించి కళాశాల వివరాలను అందజేశారు.

# అసమాన ప్రతిభాశాలి రాహుల్ సాంకృత్యాయన్

రాహుల్ సాంకృత్యాయన్ (1893 ఏప్రిల్ 9 – 1963 ఏప్రిల్ 14) అసమాన ప్రతిభాశాలి, ఆయన మేధస్సును కొలవడానికి ఏ కొలబద్ద సరి పోదంటే అతిశయోక్తి కాదేమో. కాలాలకు అతీతంగా యావత్ ప్రపంచ చరిత్రలోనే స్వయం కృషితో మహా పండితుడైన వ్యక్తి మరొకరు లేరని మేధావులు భావించడాన్ని బట్టి ఆయన ప్రతిభ తేట తెల్లం అవుతున్నది. ముప్పైకి పైగా భాషలు, వాటి యాసలు నేర్చుకుని అధికారికంగా చదువుకోక పోయినా విశ్వ విద్యాలయాల్లో బోధించే స్థాయికి ఎదగడాన్ని బట్టి ఆయన గొప్పతనం స్పష్టం అవుతున్నది.రాహుల్ సాంకృత్యాయన్ నిరంతర లోక సంచారిగా పేరొంది, 45 సంవత్సరాల పాటు యాత్రలలోనే గడిపారు. లోతైన తాత్త్విక చింతన కలిగిన సాంకృత్యాయన్ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి బౌద్ధ భిక్షువుగా మారి అనంతరం మార్క్సిస్ట్ సోషలిస్టుగా పరివర్తన చెందారు. సాంకృత్యాయన్ భారత జాతీయోద్యమంలో కూడా కృషి చేశారు. జాతీయోద్యమానికి అనుకూలంగా, బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రచనలు, ప్రసంగాలు చేసినందుకు 3సంవత్సరాల కారాగార శిక్షను అనుభవించారు. 1940వ దశకం ప్రారంభంలో ఆయన పూర్తిగా భౌతికవాద భావాలను స్వీకరించి, కమ్యూనిస్ట్ పార్టీలో సభ్యునిగా చేరి, జీవితాంతం కమ్యూనిస్ట్‌గా ఉన్నారు. అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షునిగా ఆయన అనేక రైతు పోరాటాలకు నాయకత్వం వహించారు. పురాతన బౌద్ధ గ్రంథాలను వెలికితీసి, వాటిని అనువాదం చేసి, ప్రపంచానికి తెలియపరచటంలో రాహుల్ అపారమైన కృషిని బౌద్ధులు ఎంతో విలువైనదిగా గుర్తించారు. యునైటెడ్ ప్రావిన్సెస్ (యూపీ) రాష్ట్రంలోని అజామ్‌గఢ్ జిల్లాలో 1893 ఏప్రిల్ 9లో సనాతన ధర్మాన్ని పాటించే బ్రాహ్మణ కుటుంబంలో కేదార్‌నాథ్ పాండే జన్మించారు. బౌద్ధాన్ని స్వీకరించాక, తన పేరును రాహుల్ సాంకృత్యాయన్‌గా మార్చు కున్నారు. ప్రాథమిక విద్య ఉర్దూ మాధ్యమంలో చదివారు. తొమ్మిదేళ్లప్పుడే ప్రపంచం ఏమిటో చూడాలని ఇంట్లోంచి పారిపోయాడు సాంకృత్యాయన్. 8వ తరగతి తోనే



అతని చదువు ఆగిపోయింది. కాశీ విద్యాపీఠ్‌లో సంస్కృతం నేర్చుకున్నాడు. ఆర్యసమాజంలో చేరి హిందూమత వ్యాప్తికి కొన్నాళ్లు కృషి చేశాడు. ఆయన నిత్యసంచారిగా వేలాది కిలోమీటర్లు కాలినడకన చుట్టివచ్చారు. మూడు బౌద్ధ వేదాలనూ జీర్ణించుకుని త్రిపిటకాచార్య అయ్యారు. టిబెట్, శ్రీలంక, ఇరాన్, చైనా, అప్పటి సోవియట్ రష్యా... ఎక్కడ తిరిగితే అక్కడి భాష నేర్చుకున్నారు. అరబిక్, భోజ్‌పురి, ఫ్రెంచ్, హిందీ, కన్నడం, మైథిలి, నేపాలీ, పాళీ, పర్షియన్, రష్యన్, రాజస్థానీ, సింహలీస్, తమిళం, ఉర్దూ లాంటి భాషలు అవలీలగా ఆయన నేర్చుకుని పట్టు సాధించారు. పదమూడో శతాబ్దంలో నలంద, విక్రమశిల విశ్వవిద్యాలయాలను భక్తియార్ ఖిల్జీ ధ్వంసం చేసినప్పుడు బౌద్ధ భిక్షువులు పవిత్రమైన గ్రంథాలతో పారి పోయారనీ, ఆ విలువైన సంస్కృత పుస్తకాల్ని టిబెట్‌లోని ఆరామాల్లో భద్రపరిచి వుంచారనీ ప్రచారంలో ఉంది. అయితే, ఆరు వందల ఏళ్లుగా వాటిల్లో ఏముందో చూసినవారు లేరు. సాంకృత్యాయన్ వాటికోసం అన్వేషిస్తూ, దారి కూడా సరిగాలేని కొండల్లో నడుస్తూ, కాశ్మీర్, లడఖ్, కార్గిల్ మీదుగా టిబెట్ వెళ్లారు. అక్కడ పుస్తకాలైతే లభించాయిగానీ అవి సంస్కృతంలో లేవు. అన్నీ భోటి భాషలో ఉన్నాయి. రాహుల్ కంచర గాడిదల మీద వాటిని తరలించు కొచ్చారు. ఆ గ్రంథాలన్నీ పాట్నా మ్యూజియంలో ఉన్నాయిప్పుడు. మరో మూడుసార్లు టిబెట్ వెళ్లి, టిబెటన్ నేర్చుకుని, దాని వ్యాకరణ పుస్తకాలు రాశారు. టిబెటన్–హిందీ నిఘంటువు కూర్చారు. నాటి సోవియట్ యూనియన్‌లోని అనేక రిపబ్లిక్కులలో ఆయన విస్తృతంగా పర్యటించి, సంస్కృతం, పాళీ భాషలో లిఖించబడిన అనేక శాసనాలను, రాతి ఫలకాలనూ కనుగొన్నారు. భారతదేశంలోనూ, నేపాల్, హిమాలయ సానువులలోనూ, టిబెట్ లోనే కాకుండా ఆయన మంగోలియా, ఆఫ్ఘనిస్తాన్ ఆదిగా అనేక దేశాలలో విస్తృతంగా పర్యటించాడు. తన యాత్రలో భాగంగా అరుదైన "కాన్జూర్, టాన్జూర్, గ్రంథాలను కొన్నాడు 130 వర్ణ చిత్రాలు 1600 కు పైగా వ్రాత ప్రతులు సేకరించారు. యాత్రికుడు యుఁవాన్ త్స్యాంగ్ తర్వాత ఇంత భారీగా సేకరించిన వారెవరు లేరని చరిత్ర కారుల అంచనా. 70 సంవత్సరాల వయస్సులో మరణించే సమయానికి, ఆయన దాదాపు 140 పుస్తకాలు రాశారు. జీవితంలో మొత్తం జ్ఞాపకశక్తిని కోల్పోయారు. వందలాది పుస్తకాలు కూడా కంఠోపాఠంగా కలిగిన మహా జ్ఞాని, విజ్ఞాన ఖని చివరి రోజుల్లో తన పేరేమిటో తనే చెప్పుకోలేని మతిమరుపు లోకి జారి పోయారు.1963 ఏప్రిల్ 14లో శ్రీలంకలో ఆచార్యుడుగా పనిచేస్తూ, ఆయన అంతిమ శ్వాస విడిచారు. ఆయన స్మృతి చిహ్నం డార్జిలింగ్ నగరంలో బౌద్ధమత పద్ధతిలో నిర్మించబడింది. 1958లో సాహిత్య అకాడమీ పురస్కారం, 1963లో పద్మభూషణ్ బిరుదులు ఆయనకు లభించాయి.

# వీడుతున్న ఆక్రమణల చెర

గ్రేటర్ హైదరాబాద్‌లో ఇటీవల ఫుట్‌పాత్ ఆక్రమణలపై ప్రభుత్వం కొరడా ఝుళిపించడంతో నగరవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విస్తరిస్తున్న నగరానికి తగ్గట్టుగా రహదారులు లేకపోవడంతోపాటు భారీగా వాహనాల పెరుగుదలతో హైదరాబాద్ ట్రాఫిక్ పద్మవ్యూహంలో ప్రజలు నిత్యం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నగర ప్రజలు రద్దీ సమయాల్లో రోడ్లపై నడవాలంటేనే నరకయాతన అనుభవిస్తున్నారు. ఉన్న కొన్ని ఫుట్‌పాత్‌లను కూడా చిరు, బడా వ్యాపారస్థులు కబ్జాలు చేయడంతో ఏమీ చేయలేక రోడ్డుపైనే నడుస్తూ ప్రయాణికులు ప్రమాదాలకు గురైన ఘటనలు నగరంలో అనేకం ఉన్నాయి. పరిస్థితి తీవ్రతను గుర్తించిన ప్రభుత్వం నగరం నలువైపులా ఫుట్‌పాత్‌లపై అక్రమ కట్టడాల తొలగింపుకు నడుం కట్టడంతో ప్రజలకు భారీ ఉపశమనం లభించనుంది. రాజకీయంగా, అధికారికంగా ఏ రూపంలోనైనా ఒత్తిడిలు వచ్చినా కబ్జాదారుల కబంధహస్తాల నుండి ఫుట్‌పాత్‌లను విముక్తి చేయాలి. వేగంగా అభివృద్ధి చెందుతూ మెట్రో నగరంగా గుర్తింపు పొందుతున్న హైదరాబాద్ ఐటి, మౌలిక వసతులు, రహదారుల విస్తరణలో ముందంజలో ఉన్నా ఫుట్‌పాత్‌ల పరిస్థితి ఆందోళనకరంగానే ఉన్నాయి. దీంతో వేగంగా వెళ్లే వాహనాలతో ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు ఉన్నాయి. ముఖ్యంగా వృ ద్ధులు, పిల్లలు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరంలో నడక ప్రమాదకరంగా మారిపోయింది. ప్రతి సంవత్సరం గ్రేటర్ హైదరాబాద్‌లో వెయ్యికిపైగా పాదచారుల ప్రమాదాలు నమోదవుతున్నాయి. ఉదాహరణకు 2024 గణాంకాలు పరిశీలిస్తే 400 మంది పాదచారులు ప్రమాదంలో మృతి చెందారు. 775 మంది గాయపడ్డారు. అంటే నగరంలో రోజుకు సుమారు 30 మందికిపైగా పాదచారులు రోడ్డు ప్రమాదాల బారీనపడుతున్నారు. ఈ ప్రమాదాలు అత్యధికంగా ఫుట్‌పాత్ సమస్యలతో ముడిపడి ఉండడం గమనార్హం. నగరంలో రహదారుల, ఫుట్‌పాత్ సమస్యలు పరిష్కరించడంలో భాగంగా వాటిని అభివృద్ధి చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. సుమారు మూడు వేల కోట్లకుపైగా రూపాయలు వెచ్చించి వెయ్యి కిలోమీటర్లకు పైగా రోడ్లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఈ ప్రాజెక్టులో భాగంగా బిటి, సిసి రోడ్లతోపాటు ఫుట్‌పాత్‌లు, సెంట్రల్ మీడియన్లు, సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయనున్నారు. వీటిలో 700 కిలోమీటర్లకుపైగా రోడ్లను అభివృద్ధి చేయడంతోపాటు, అదనంగా 200 కిలోమీటర్లకుపైగా రోడ్లను ఎఫ్‌డిఆర్ సాంకేతికతతో పునర్నిర్మాణం చేయనున్నారు. వీటితోపాటు నగరం మొత్తం ఫుట్‌పాత్‌లను కూడా సమగ్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా జిహెచ్ఎంసి 2025 –26లో గుంతలు పూడ్చడంతోపాటు ట్రాఫిక్ భద్రతా చర్యలను చేపట్టింది. నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు 24 లింక్ రోడ్ల నిర్మాణానికి సుమారు రూ. 487 కోట్ల ప్రణాళికను అమలు చేస్తున్నారు. రోడ్లు, ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ట్రాఫిక్ సమస్యలకు, రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న కట్టడాలపై కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధమైన జిహెచ్ఎంసి ప్రతి వారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తుంది. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం హైకోర్టు ఆదేశాలు, రాష్ట్ర ప్రభుత్వం సూచనలకు అనుగుణంగా నగరం నలువైపులా అక్రమ కట్టడాలను తొలగించేందుకు



ముందుకొచ్చిన జిహెచ్ఎంసి ఏప్రిల్ 4వ తేదీన హైడ్రా, పోలీసు శాఖలతో సమన్వయం చేసుకొని ఆరు జోన్ల పరిధిలోని 798 నిర్మాణాలను నేలమట్టం చేసింది. తొలగించిన వాటిలో 340 పూర్తిస్థాయి, 458 తాత్కాలిక నిర్మాణాలు న్నాయి. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సున్నితమైన పాతబస్తీతోపాటు కొన్ని చోట్ల ఉద్రిక్తతలు నెలకొన్నా అధికారులు సమన్వయంతో విజయవంతంగా అక్రమాలను తొలగించారు. ఇదే తరహాలో ఇకపై నగరవ్యాప్తంగా ప్రతివారం ఏదో ఒక ప్రాంతంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని జిహెచ్ఎంసి అధికారులు ప్రకటించడంతో కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నా యి. నగర ప్రజలు ఇదే కోరుకుంటున్నారు. చారిత్రాత్మకమైన హైదరాబాద్ నగరం లోని ప్రధాన మార్గాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలు పలు సమస్యల కు కారణాలవుతున్నాయి. ఉదాహరణకు ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను ఆకట్టుకునే చార్మినార్ పరిసరాల్లో వ్యాపారస్థులు పూర్తిగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతో పర్యాటకులు నడవలేని పరిస్థితి నెలకొంది. దక్షిణ హైదరాబాద్‌కు ముఖద్వారమయిన మూసీనదిపై నాటి నిజాం కాలంలో నిర్మించిన వంతెన ఎంతో ఆకర్షణీయంగా ఉండేది. ప్రస్తుతం పాతబస్తీలో మూసీ నదిపై ఉన్న వంతెనలన్నింటిలో 'నయాపూల్'గా పిలువబడే వంతెన ఎత్తైనది. భారీ వాహనాల ప్రయాణానికి అనువుగా నిర్మించిన ఈ వంతెనపై రిక్షాలు, సైకిళ్ల కోసం, పాదచారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. 2000 సంవత్సరం వరకు ఇదే తరహాలో ఉండేది. అయితే దురదృష్టవశాత్తు ఇప్పుడు భారీ వాహనాల మార్గం మినహాయించి రిక్షాలు, సైకిళ్లు, పాదచారులకోసం ఏర్పాటు చేసిన మార్గాలు పూర్తిగా తోపుడు బండ్లతో నిండిపోతున్నాయి. అక్కడ పాదచారులు భారీ వాహనాలు నడిచే మార్గంలోనే నడవాల్సి ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ఇదే మార్గంలో ముందుకెళ్తే చారిత్రాత్మక కట్టడాలున్న మదీనా, గుల్జర్‌హౌజ్, చార్మినార్ మరింత క్లిష్ట పరిస్థితులున్నాయి. పాతబస్తీలోనే కాదు నగరం నడిబొడ్డున ఉన్న సికింద్రాబాద్, కోఠి, నాంపల్లి, చిక్కడిపల్లి, మెహిదీపట్నం, ఆరాంఘర్, పంజాగుట్ట, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్, ఉప్పల్ వంటి పలు ప్రధాన మార్గాల్లో ఇలాంటి దుస్థితే నెలకొంది. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా స్పందించకుండా ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వారిలో తప్పు చేస్తున్నామనే స్పందనలేకపోవడం, రాజకీయ ప్రయోజనాలతో వారికి మద్దతుగా నేతలు బలప్రదర్శన చేస్తూ అధికారులను అడ్డుకోవడం దురదృ ష్టకరం. ఇటీవల నగరంలోని ఆరు జోన్లలో అక్రమాలను తొల గిస్తుంటే పాతబస్తీతోపాటు కొన్ని చోట్ల నాయకులు అడ్డుకోవ డానికి ప్రయత్నించినా అధికారులు వెనక్కి తగ్గకుండా పని పూర్తిచేయడం అభినందనీయం. ఎంతోకాలం గా అక్కడ వ్యాపారాలు చేస్తున్నారని, వారందరూ చిరు వ్యాపారులు అంటూ ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వారికి మద్దతుగా నిలిచే వారు వాదిస్తున్నారు. దీర్ఘకాలికంగా వారక్కడ ఆక్రమించి ప్రజ లను ఇబ్బందుల పాలుచేస్తున్నారనే ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంటుందనే వాస్తవాన్ని వారు గ్రహించాలి. చిరువ్యాపా రుల జీనవోపాధి దెబ్బతినడం బాధా కరమే. ఇలాంటి వారి కోసం అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా ప్రత్యామ్నాయం ఆలోచించి చర్యలు తీసుకోవాలి. మరోవైపు ప్రధాన కూడళ్లలో బడా వ్యాపారస్థులు కూడా తమ దుకాణాలకు ముందున్న ఫుట్‌పాత్‌లను ఆక్రమించి లావాదేవీ లు నిర్వహిస్తున్న ప్రదేశాలు నగరంలో కోకొల్లలు. మరికొన్ని చోట్ల పెద్ద వ్యాపారస్థులే వారి మనుషులతో ఫుట్‌పాత్‌లను ఆక్రమింపజేసి వ్యాపారాలు నిర్వహిస్తుంటారు. వాస్తవాలు ఇలా ఉంటే చిరువ్యాపారులకు అన్యాయం జరుగుతుందంటూ రాజకీయ నేతలు అధికారులపై ఒత్తిడి తేవడం ప్రజలను ఇబ్బందుల పాలుజేయడమే. విస్తరిస్తున్న హైదరాబాద్ మహాన గరానికి అనుగుణంగా రహదారులు, ఫుట్‌పాత్ అభివృద్ధి కోసం ఆలస్యంగానైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై కబ్జాల తొలగింపు కార్యక్రమాన్ని ఒక్క రోజుకే పరిమితం చేసి చేతులు దులుపుకోకుండా ఆ అక్రమ కట్టడాలపై పర్యవేక్షణ నిత్యం కొనసాగాలి. తొలగించిన కట్టడాలను పాతబస్తీ వంటి కొన్ని ప్రాంతాల్లో తిరిగి నిర్మిస్తున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో వాటిని అరికడితేనే ప్రభుత్వ లక్ష్యం సఫలమవు తుంది. ఎలాం టి ఒత్తిడిలకు లొంగకుండా పాతబస్తీతో సహా నగరంలోని నలుమూలల రహదారులపై అక్రమంగా వెలిసిన కట్టడాలన్నిం టినీ తొలగించాలని నగరవాసులు అందరూ కోరుకుంటు న్నారు. ఆక్రమణల తొలగింపుతో గ్రేటర్ రహదారులకు మహ ర్దశ ఏర్పడుతుందని ఆశిస్తున్నారు. ఇలాంటి బహత్కరమైన కార్యమ్రాలను తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా కొనసాగిస్తే కబ్జాదారులు మరోసారి అక్రమాలు చేయడానికి సాహసించరు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143